అధికారం కోసం నమ్మించి మోసం

చిన్నచిన్న కారణాలతో రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్న ఏజెన్సీ గిరిజన రైతులు

ఇంద్రవెల్లి, ఆగస్టు 21 : రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇంద్రవెల్లి లోని బ్యాంకులకు రైతులు వెళ్లి అడిగితే వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్లి అడిగితే చిన్నచిన్న కారణాలు తెలుపుతున్నారు. దీంతో రైతులకు రాష్ట్ర ప్రభుత్వంపై పూర్తి నమ్మకం లేకుండాపోయిందని రుణమాఫీ కాని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భార్యభర్తలు తీసుకున్న వ్యవసాయ రుణాలను కలిపి మొత్తం బ్యాంకు అప్పుగా రూ.2లక్షలపై చూపించి, మాఫీ కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిందని రైతులు మండిపడుతున్నారు.

ఆధార్‌కార్డు నంబర్ తప్పుగా ఉంది

నా పేరిట రూ.లక్ష 20 వేల బ్యాంకు రుణం ఉంది. నా బ్యాంకు ఖాతాకు నా ఆధార్‌కార్డు నంబర్‌కు బదులుగా వేరే రైతుకు చెందిన ఆధార్‌కార్డు నంబర్ లింక్ ఉంది. అందుకే నాకు రెండు, మూడో విడుతలో రుణమాఫీ డబ్బులు రాలేదు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాను. ఆధార్‌కార్డు నంబర్ మార్చితే రుణమాఫీ వస్తుందని తెలిపారు. **-ఆర్కా జైరాం, రైతు, మర్కాగూడ**

రుణమాఫీలో బ్యాంకు పేరు లేదు

కాంగ్రెస్ నాయకులు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెబితే వారిని నమ్మి మోసపోయాను. నాకు గూడిహత్నూర్ మండలం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.లక్ష 67వేల రుణం ఉంది. ప్రభుత్వం మాఫీ చేసిన రుణమాఫీ జాబితాలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పేరు లేదని అధికారులు చెప్పారు. మా ధనోరా(బీ) గ్రామంలో 350 మంది రైతులు ఉంటే 25 మందికి రుణమాఫీ వచ్చింది. మిగిలిన రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు.
-మెస్రం రాము, రైతు, ధనోరా(బీ)

నా ఆధార్‌కార్డు నంబర్ తప్పుగా ఉండడంతో మాఫీ కాలేదు

నా పేరిట బ్యాంకులో రూ.లక్ష 25 వేల రుణం ఉంది. కానీ నాకు చెందిన ఆధార్‌కార్డు నంబర్ ఖాతాకు లింక్ చేసేటప్పుడు తప్పుగా నమోదైంది. అందుకే నాకు రుణమాఫీ కాలేదు. వ్యవసాయ శాఖ అధికారులను కలిసి అన్ని రకాల కాగితాలు అందించాను. రుణమాఫీ రావడానికి సమయం పడుతుందని అధికారులు చెప్పడం జరిగింది.
-ఎద్దుల ప్రకాశ్, రైతు, సట్వాజీగూడ, ఇంద్రవెల్లి

రైతులను మోసం చేస్తున్నారు

నా పేరిట లక్ష రూపాయలు, నా భార్య పేరిట ఒక లక్ష 25 వేల రుణం ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీలో మా పేర్లపై డబ్బులు రాలేదు. మా గ్రామంలో దాదాపు 50 మంది రైతులు ఉంటే అందులో ముగ్గురికి మాత్రమే రుణమాఫీ డబ్బులు వచ్చాయి. మా ఇద్దరు భార్యభర్తలను కలిపి రుణమాఫీ రాకుండా ప్రభుత్వం కుట్రలు చేసింది. రుణమాఫీ డబ్బులు వస్తాయని ఎంతో ఆశతో ఎదురు చూశాను.
-ఆత్రం సుదర్శన్, రైతు, గోపాల్‌పూర్

అందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుంది

మండలంలోని ప్రతి రైతుకు ప్రభుత్వం రుణమాఫీ చేసి తీరుతుంది. మండల రైతులు ఆందోళన చెందవద్దు. వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికలో కూర్చొని రుణమాఫీ కాలేదని అంటున్న రైతులకు చెందిన పూర్తి వివరాలను పరిశీలిస్తున్నారు. రైతు వేదికకు వచ్చిన రైతుల సమస్యలను గుర్తించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుంది. చిన్నచిన్న కారణాలు మాత్రమే ఉన్నాయి. రైతులు ఆందోళన చెందకుండా ఉండాలి. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ఇంద్రవెల్లి రైతు వేదికలో మండల ఏఈవోలు అందుబాటులో ఉన్నారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రైతుల దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుంది.
-మండల వ్యవసాయ అధికారి రాథోడ్ గణేశ్

రుణమాఫీ, గ్యారెంటీల అమలులో
కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

రైతులతో మాట్లాడుతున్న మాజీమంత్రి జోగు రామన్న

తలమడుగు, ఆగస్టు 21 : రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో అరెస్టు అయిన రైతులను ఆయన పరామర్శించారు. అనంతరం మాజీమంత్రి విలేకరులతో మాట్లాడారు. పట్టా పాసుపుస్తకాలు చూపిస్తా దమ్ముంటే రండి కానీ అమాయక రైతులను అరెస్టు చేసి కేసులు పెట్టడం సరికాదన్నారు. కనీసం 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. పట్టాపాసు పుస్తకం ప్రామాణికంగా రుణమాఫీ చేయాలి కానీ ఆంక్షలు ఎందుకని ప్రశ్నించారు. రైతులపై కేసులు పెడితే రైతు ఉద్యమానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్ కుమార్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్, నాయకులు గోక సుదర్శన్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, వెంకటేశ్, ప్రశాంత్, గంగాధర్, నారాయణ, ప్రహ్లాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత్ బంద్ ప్రశాంతం

ఉట్నూర్/ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి/తలమడుగు/నిర్మల్‌అర్బన్/లక్ష్మణచాంద/తానూర్/ఖానాపూర్/భైంసా, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా నిరసిస్తూ ఉట్నూర్‌తో పాటు గ్రామాల్లో, తలమడుగు, ఖానాపూర్‌లో మాలమహానాడు, ఉప కులాలు, ఇంద్రవెల్లిలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ, దళిత సంఘాలు, నార్నూర్, గాదిగూడలో లార్డ్‌బుద్ధ సొసైటీ, మహర్ బెటాలియన్, అంబేద్కర్ యువజన, భీంఆర్మీ సైనికుల సంఘాలు, నిర్మల్, భైంసా, కుంటాల, లక్ష్మణచాంద, తానూర్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో భారత్ బంద్ విజయవంతమైంది. నాయకులు దుకాణాలు మూసివేయించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల యాజమానులు సెలవు ప్రకటించారు. పలు చోట్ల బైక్ ర్యాలీ తీసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకునే వరకు తమ పోరాటలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. మాల మాహనాడు జాతీయ అధ్యక్షుడు రాంమూర్తి, భారతీయ బౌద్ధమహాసభ తెలంగాణ కార్యదర్శి పవార్ సూర్యకాంత్, మాల మహానాడు, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్, దళిత సంఘాలు, ఉప కులాల నాయకులు పాల్గొన్నారు.

భైంసా: ర్యాలీగా వెళ్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు

ఇంద్రవెల్లి: మూసి ఉన్న దుకాణాలు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

జైనథ్, ఆగస్టు 21 : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్, జైనథ్ పీహెచ్‌సీ వైద్యాధికారి నయనత అన్నారు. బుధవారం మండలంలోని లేకర్‌వాడ గ్రామాన్ని సందర్శించారు. డ్రైడే ఆక్టివిటీస్, ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, ఏఎన్ఎం, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇచ్చోడ : ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

ఇచ్చోడ(సిరికొండ), ఆగస్టు 21: సిరికొండ, నేరడిగొండ(జీ), నారాయణపూర్, గోధమల్లే, జెండాగూడ, సోంపెల్లి గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గ్రామాలను సందర్శించి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఒరగంటి పెంటన్న, గొర్ల రాజన్న, తోకల చందు, సూర్యకాంత్, బోయిన్‌వాడ తులసీదాస్ పెందూర్, కృష్ణ, సిడాం రాంపాల్, భూమేశ్, సంతోష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బోథ్, ఆగస్టు 21: బోథ్‌కు చెందిన ఎంపీడీవో సుశీల్ రెడ్డి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. అనంతరం బేరే రాంరెడ్డి, అల్లకొండ పోతన్న, మంద గుండయ్య, మంచికుంట్ల లక్ష్మణ్ కుటుంబీకులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన నైకపు గంగమణిని ఎమ్మెల్యే పరామర్శించి భరోసా కల్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, పార్టీ కన్వీనర్ డీ నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, సురేందర్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, రవి, రమణ గౌడ్, తిరుమల్ గౌడ్, రవీందర్ రెడ్డి, కేదారేశ్వర్ రెడ్డి, రఫీ, డాక్టర్ స్వామి ఉన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

బోథ్, ఆగస్టు 21 : బోథ్ కోర్టు ప్రాంగణంలో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి బీ హుస్సేన్ అన్నారు. బుధవారం బోథ్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న కేసులు, బ్యాంకు కేసులు పరిష్కరమయ్యే విధంగా న్యాయవాదులు చొరవ చూపాలని పేర్కొన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే, సుభాష్, రూపేందర్ సింగ్, కుమ్మరి విజయ్‌కుమార్, హరీశ్, దమ్మాపాల్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు

తలమడుగు, ఆగస్టు 21 : మండల కేంద్రంతో పాటు ఉండం, సుంకిడి, ఖోడద్, రుయ్యాడి గ్రామాల్లో పీఆర్టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులకు పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి కుడాల రవీందర్ అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేందర్ యాదవ్, రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస స్వామి, వినోద్ రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

నేడు కుభీర్‌లో రుణమాఫీ కోసం ధర్నా

కుభీర్, ఆగస్టు 21 : కుభీర్‌లోని అన్నాభావు సాఠే చౌక్‌లో గురువారం ఉదయం 10 గంటలకు మండల రైతులతో ధర్నా నిర్వహించనున్నట్లు ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రెవార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎన్నీల అనిల్, సహకార సంఘం చైర్మన్ రేకుల గంగాచరణ్, వైస్‌ఎంపీపీ మోహియొద్దీన్, పుప్పాల పీరాజీ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని గురువారం చేస్తున్న ధర్నాలో రుణమాఫీ కానీ రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

కుంటాల, ఆగస్టు 21 : కుంటాలలోని గజ్జలమ్మ ఆలయ ఆవరణలో రీడింగ్ రూమ్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ తెలిపారు. బుధవారం గ్రామస్తులతో కలిసి ఆలయ ఆవరణలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలను చర్చించారు. భక్తుల సౌకర్యార్థం మెయిన్ రోడ్ నుంచి ఆలయం వరకు రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. అలాగే గతంలో నిలిచిపోయిన గాలిగోపురం, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. వచ్చే వార్షికోత్సవం లోపల పనులు పూర్తి చేస్తామని అన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఇన్‌చార్జి మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మానాజీగారి పోశెట్టి, సక్రపు చిన్నన్న, వెంకటేశ్, తోట గజ్జారాం, తాటి మహేశ్, పంచాయతీ రాజ్ ఏఈ క్రాంతి పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

భైంసాటౌన్, ఆగస్టు 21 : మహాగాం గ్రామానికి చెందిన దేవ్‌కర్ నాగన్న కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు మిషన్ భగీరథ ట్యాంకులో పడి మృతి చెందాడు. నాగన్న టీజీబీ బ్యాంకులో రూ. 500లతో ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు. బాధిత కుటుంబానికి మంజూరైన రూ.10 లక్షల విలువైన చెక్కును బుధవారం నాగన్న భార్య లలితకు బ్యాంకు మేనేజర్ అభిలాష్ అందజేశారు. కార్యక్రమంలో షబాజ్, గంగాప్రసాద్, రాథోడ్ దత్త పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

కుభీర్, ఆగస్టు 21 : తెలంగాణ కవులు, కళాకారులు, మేధావులు, అమర వీరులకు గుర్తింపు తీసుకు వచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందని తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మండల నాయకుడు పుప్పాల పీరాజీ కొనియాడారు. బుధవారం కుభీర్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం అధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కనకాగౌడ్, రామాగౌడ్, కిష్టాగౌడ్, మాజీ ఎంపీపీ విఠల్, బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ కే రాజన్న, పోగుల బాబు, రాందాస్ ఆయా గ్రామాల గీత కార్మికులు పాల్గొన్నారు.

సాంకేతిక కారణాలతో సామాన్యులకు తిప్పలు

కుంటాల, ఆగస్టు 21 : విద్యుత్ జీరో బిల్లును అమలు చేయాలని పెంచికల్‌పాడ్ గ్రామంలో బీజేపీ నాయకులు కరపత్రాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి సాయి సూర్యవంశీ, నాయకులు పవన్, ప్రసాద్, రాకేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE
All the general public here by informed that **Sri. Shaik Wasifuddin S/o Shaik Ahmed, Occ: Business, R/o H.no. 3-1-123, Bangala Galli, Bhainsa town, Dist. Nirmal** intended to deposit his title deeds of the over the property of the piece and parcel of the country tiled, zinc sheet, RCC house no. 3-1-123, total admeasuring area 2151.25 Sq. feet = 239 Sq. yards = 199.85 Sq. meters, CT plinth area 905.25 Sq. feet, zinc sheet plinth area 382.50 Sq. feet and RCC plinth area is 50 Sq. feet total plinth area 1337.75 Sq. feet Situated at BangalaGally, Bhainsa town, under the limits of municipality Bhainsa, Dist. Nirmal, Telangana State which is bounded by **East**: road, **West:** house of Jamaluddin and others, **North:** house of Aleemuddin, **South:** house of Vakeel Patel, Shaik Ameer & Akbar Khan. At present **Sri. Shaik Wasifuddin S/o Shaik Ahmed** is intended to create **EQUITABLE MORTGAGE** in favour of M/s. Shriram Finance Ltd., Branch: Bhainsa for the purpose of Small & Medium Enterprises loan. As such if any person or persons have any interest or any other right or title over the said property can furnish their objections if any, for the said creation of mortgage, and if they have any claims with regard to title and have any documents related to the said property also can file and furnish the same at my office within a week days time from the publication of this notice. If any objections pertains to the said property raised after the said stipulated time, shall not be entertained and considered. Hence this notice.
Sd/- J.KRISHNA MOHAN RAO, Advocate
Shastrinagar South, Nirmal, Cell:9959298938

వయోవృద్ధుల రక్షణ, సంరక్షణ కోసం చట్టాలు

ఎదులాపురం, ఆగస్టు 21 : వయోవృద్ధుల రక్షణ, సంరక్షణ కోసం ఉన్న చట్టాలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించేలా చర్యలు

ఎదులాపురం, ఆగస్టు 21 : ఎల్ఆర్ఎస్‌లో పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్‌ఖాన్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, పరిశీలన, సర్వే, యాప్‌లో నమోదు గురించి వివరించారు. 2020 ఆగస్టు కంటే ముందు పత్రాలు ఉండి ఎల్ఆర్ఎస్ కోసం ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో వాటిని పరిశీలించాలన్నారు.

గెల్లు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

పండ్లు పంపిణీ చేస్తున్న ధరణి రాజేశ్

ఉట్నూర్ రూరల్, ఆగస్టు 21: మండలంలోని దివ్యాంగుల పాఠశాలలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దూట మహేందర్, గిరి నాయక్, సత్యం, శివ, భూమన్న, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జూడాలకు అన్ని విధాలుగా సహకారం

ఎదులాపురం, ఆగస్టు 21 : జూడాలకు మెడికల్ క్యాంపస్‌లో అన్ని విధాలుగా సహకారం, పర్యవేక్షణ, భద్రత ఉంటుందని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటనను నిరసిస్తూ ఆదిలాబాద్ రిమ్స్ జూడాలు చేపడుతున్న ఆందోళన బుధవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక రిమ్స్ మెడికల్ కాలేజ్ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌ను కలిసి మెడికల్ కాలేజీలో నెలకొన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని డైరెక్టర్ హామీ ఇచ్చారు.

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి

ఇచ్చోడ, ఆగస్టు 21: విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ నరేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన ఉన్నత పాఠశాల బాలురలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాల్‌రావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బుచ్చయ్య

భైంసా, ఆగస్టు 21 : భైంసాలోని గోపాల్‌రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కర్రోల్ల బుచ్చయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులు విద్యార్థులు నూతన ప్రిన్సిపాల్‌ను స్వాగతించి శాలువాతో సన్మానించారు.

కుంటాల ఎస్ఐగా భాస్కరాచారి

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న భాస్కరాచారి

కుంటాల, ఆగస్టు 21 : కుంటాల ఎస్ఐగా పని చేసిన వీ రజనీకాంత్ ముప్కాల్‌కు బదిలీ కాగా అక్కడ పని చేస్తున్న ఎస్ఐ భాస్కరాచారి కుంటాల పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది స్వాగతం పలికారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మరమ్మతులు

ఎమ్మెల్యే చొరవతో తాత్కాలికంగా వేస్తున్న రోడ్డు

ముథోల్, ఆగస్టు 21 : ముథోల్ మండలం విట్టోలి తండా నుంచి ఆష్ట వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వెంటనే రోడ్డు భవనాల శాఖ అధికారులతో మాట్లాడారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం ఈ రోడ్డుకు రోడ్డు భవనాల శాఖ అధికారులు మరమ్మతుల పనులు చేపట్టారు. ఎమ్మెల్యే చొరవతో రోడ్డు బాగు చేస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి వెంట యువ నాయకుడు సతీశ్ రెడ్డి ఉన్నారు.

పథకాలను సక్రమంగా అమలు చేయాలి

ఎదులాపురం, ఆగస్టు 21 : వయోవృద్ధులకు ప్రభుత్వం కల్పించే పథకాలను సక్రమంగా అమలు చేయాలని వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవీదాస్ దేశ్‌పాండే అన్నారు. బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్‌లో వయో వృద్ధులను సత్కరించారు. శతాధిక, 86 సంవత్సరాలు దాటిన వారిని వారి ఇండ్లకు వెళ్లి సన్మానించి వృద్ధుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ సిటిజన్లకు ప్రభుత్వం బస్సు, రైలు ప్రయాణంలో రాయితీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాంకులకర్ణి, ఉపాధ్యక్షుడు శీల కిషన్, కోశాధికారి శేషగిరిరావ్ పాల్గొన్నారు.

హైమాస్ట్ స్ట్రీట్ లైట్లకు మరమ్మతులు

ఎదులాపురం, ఆగస్టు 21 : ఆదిలాబాద్‌లోని కొలిపూరలోని ఆయిసా మసీద్ సమీపంలోని హైమాస్ట్ స్ట్రీట్ లైట్లు బుధవారం మున్సిపల్ సిబ్బందితో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు జహీర్ రంజానీ మరమ్మతులు చేయించారు. గత కొద్ది రోజుల నుంచి లైట్లు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆ సమస్యను వెంటనే పరిష్కరించారు. ఆయన వెంట సయ్యద్ షౌకత్ అలీ ఉన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325792-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సోన్, ఆగస్టు 21 : సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామానికి చెందిన పాల్దె లక్ష్మికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 40,500 మంజూరయ్యాయి. బుధవారం నిర్మల్‌లో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి లబ్ధిదారురాలుకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అంకం శ్రీనివాస్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ అర్బన్, ఆగస్టు 21 : నిర్మల్ జిల్లాలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న 32 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. వీటిలో వంట మనిషి, స్లీపర్, ఆఫీస్ సబార్డినేట్, డే, నైట్ వాచ్ ఉమెన్ పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆయా మండలాల విద్యాశాఖ కార్యాలయం నందు అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులు అందించాలని సూచించారు.

బాలుడిని కాటేసిన పాము

ఎదులాపురం, ఆగస్టు 21: వాఘపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలంగూడకు చెందిన కొడప రాజు(8)ను బుధవారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా పాము కాటేసింది. వెంటనే స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించా. ఘటన స్థలానికి చేరుకున్న వాహన సిబ్బంది బాలుడిని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

పరారీలో ఉన్న దొంగ అరెస్టు

ఎదులాపురం, ఆగస్టు 21: ఆదిలాబాద్‌లోని శ్రీనివాస వైన్స్ షాపులో జూన్‌లో యజమానికి మద్యం సీసాలు కావాలని బెదిరించి కౌంటర్‌లో నుంచి రూ.3 వేలు తీసుకొని పారిపోయిన దొంగను పట్టుకున్నట్లు టూటౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ తెలిపారు. ఈ కేసులో గతంలో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా పరారీలో ఉన్న అతికుద్దీన్ ఫారూఖిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి రూ.వెయ్యి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

వ్యాక్సినేషన్ కేంద్రం పరిశీలన

ముథోల్, ఆగస్టు 21 : ముథోల్‌లోని బీసీ సంఘ భవనంలో గల వ్యాక్సినేషన్ కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిస్ గోరి పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే విధంగా చూడాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారిణి నేహా, ఏఎన్ఎం విజయ, తదితరులు ఉన్నారు.

కబ్జాదారులను కఠినంగా శిక్షించాలని

ఎదులాపురం, ఆగస్టు 21 : ఆదిలాబాద్‌లోని కైలాస్‌నగర్ ఎన్జీవో సొసైటీ ప్లాట్లను కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ఎస్పీ గౌష్ ఆలంను కోరారు. ఈ విషయమై బుధవారం జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ కైలాస్‌నగర్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దుర్గం శేఖర్, సభ్యులు రాంకుమార్, రాంకిషన్, కొండల్ రావు, గంగారెడ్డి, రాహుల్ ఉన్నారు.

తీవ్రలోప పోషణ ఉన్న చిన్నారులను గుర్తించాలి

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 21: తీవ్ర లోప పోషణ ఉన్న చిన్నారులను గుర్తించాలని నిర్మల్ సీడీపీవో నాగమణి అన్నారు. నిర్మల్‌లోని బంగల్‌పేట ఆరోగ్య కేంద్రంలో బుధవారం లోప పోషణ నివారణపై వైద్య, ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించి లోప పోషణ ఉన్న చిన్నారులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మనీషా, సీవో రాములు, సూపర్‌వైజర్ విజయ గౌరి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులకు బాలుడిని అప్పగించిన రిమ్స్ సెక్యూరిటీ గార్డ్

ఎదులాపురం, ఆగస్టు 21: ఆదిలాబాద్‌లోని రిమ్స్‌ను ట్రామా కేర్ వాడల్లో రోగుల సహాయకుల దగ్గర నుంచి దొంగతనం చేస్తున్న బాలుడిని అక్కడే విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డు పట్టుకున్నారు. ఆ బాలుడి వద్ద నుంచి రూ.7 వేలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమ్స్ ఔట్ పోస్టు పోలీసులకు అప్పగించారు. అప్పగించిన వారిలో సెక్యూరిటీ గార్డు సూపర్‌వైజర్ పొచ్చన్న, సెక్రటరీ నరేశ్ ఉన్నారు.

చికిత్స పొందుతూ మహారాష్ట్ర రైతులు మృతి

ఎదులాపురం, ఆగస్టు 21: పత్తి పంట దిగుబడి రాదేమోనన్న బెంగతో, చేసిన అప్పులు ఎలా తీర్చాలని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహారాష్ట్రకు చెందిన ఇద్దరు రైతులు చికిత్స పొందుతూ మృతి చెందారు. టూటౌన్ ఏఎస్ఐ ముకుంద్ రావ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర కిన్వాట్ పట్టోడా గ్రామానికి చెందిన సోయం దత్త (26), ఈ నెల 20వ తేదీన పురుగుల మందు తాగాడు. మహారాష్ట్ర పాంఢ్రక్వాడ, కేలాపూర్ కారేగావ్‌కు చెందిన చింతల్వార్ అశ్విత్ (32) ఈ నెల 19న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు స్థానికులు మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. కాగా జీరో ఎఫ్ఐఆర్ చేసినట్లు తెలిపారు.

బాలింత, శిశువు మృతి

భైంసా, ఆగస్టు 21 : భైంసాలోని ఏరియా దవాఖానలో బుధవారం బాలింత, శిశువు మృతి చెందారు. వివరాలకు వెళ్తితే.. కుభీర్ మండలం బ్రహ్మేశ్వర్ గ్రామానికి చెందిన శీతల్ రాథోడ్ (25) ఏరియా దవాఖానకు ప్రసూతి కోసం మంగళవారం వచ్చింది. సాయంత్రం సమయంలో కడుపులోనే శిశువు మృతి చెందింది. అనంతరం వైద్య నిపుణురాలు శస్త్ర చికిత్స చేయగా అప్పటికే కడుపులోనే శిశువు మృతి చెందిఉందని తెలిపారు. రాత్రి సమయంలో బాలింత శీతల్ సైతం మృతి చెందారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతి చెందిన విషయం కలెక్టర్‌కు తెలియడంతో విచారణ నిమిత్తం తహసీల్దార్‌కు ఆదేశించినట్లు తెలిసింది.

గుట్కా పట్టివేత

బోథ్, ఆగస్టు 21: బోథ్ మండలం గుట్టపక్కతండా గ్రామానికి చెందిన చంబర్ సుభాష్ అక్రమంగా గుట్కా తరలిస్తున్నాడనే ముందస్తు సమాచారంతో బుధవారం దాడి చేసిన పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పట్టుకున్న గుట్కా విలువ రూ.28,264 ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చీటీల పేరుతో మోసం చేసిన ఇద్దరి అరెస్ట్

బోథ్, ఆగస్టు 21 : చీటీల పేరుతో అమాయక ప్రజల నుంచి రూ.2 కోట్ల పైగా వసూలు చేసి మోసం చేసిన ఇద్దరి వ్యక్తులను పట్టుకున్నట్లు బోథ్ సీఐ బీ రమేశ్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్‌కు చెందిన సిరిపురం రవికుమార్, ఉడుత గంగాధర్‌పై పలు కేసులు నమోదు కాగా వారు తప్పించుకొని తిరుగుతున్నారు. బుధవారం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇలాంటి మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

బజార్‌హత్నూర్, ఆగస్టు 21: ఆర్థిక ఇబ్బందులు భరించలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బజార్‌హత్నూర్ మండలం కొలంగూడ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అప్పారావు వివరాల ప్రకారం..కొలంగూడ గ్రామానికి చెందిన కుమ్ర రాజు (40) కొంతకాలంగా అనారోగ్యానికి గురై కాలు విరగడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పాడ్డాయి. చేసిన అప్పులు తీర్చలేక కుటుంబ పోషణ భారమై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..

కడెం,ఆగస్టు 21 : కడెం మండలం పెద్దూర్ గ్రామానికి చెందిన గడ్డం రాజన్న తన ఇంట్లో సమస్యలు ఎదురవుతున్నాయని జీవితం విరక్తి చెంది ధర్మాజీపేట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో టేకు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య గడ్డం భూదవ్వ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.